

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 260 | పేజీలు : 8 | వెల : రూ.2/- బుధవారం 14 అక్టోబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

ఐదు నదుల అనుసంధానమే లక్ష్యం!

- ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు బాగుపడాలి

- విజయవాడ ఉత్సవ్-2లో సీఎం చంద్రబాబు ఆకాంక్ష



విజయవాడ, మన జనప్రగతి అక్టోబర్ 13: దేశ అభివృద్ధితోపాటు దక్షిణాది రాష్ట్రాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. కృష్ణా, గోదావరి, పెన్నా, తుంగభద్ర, కావేరి నదులను అనుసంధానం చేయాలన్నది తమ ఆకాంక్షగా పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఏదైనా సాధ్యమేనని విశ్వాసం వ్యక్తం చేశారు.విజయవాడలోని పున్నమి ఘాట్‌లో మంగళవారం నిర్వహించిన విజయవాడ ఉత్సవ్ సీజన్-2 కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విజయవాడ ఉత్సవ్‌కు సీఎం విజయ్ రావడం కార్యక్రమానికి కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. పార్టీ స్థాపించిన రెండేళ్లలోనే ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగిన విజయ్ తమిళనాడు అభివృద్ధికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు.రాష్ట్రాలు వేరైనా అభివృద్ధి లక్ష్యం ఒక్కటేనని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు కూడా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కృష్ణా, గోదావరి నదులు విజయవాడ నుంచే అనుసంధానమవుతాయని పేర్కొంటూ, మిగతా2లో...

ప్రపంచంతో కలిసి ఎదుగుతున్న భారత్

- ఎవరి ప్రయోజనాలకూ భంగం కలిగించం: ప్రధాని మోదీ
- బలమైన ఆర్థిక పునాదులు, నిరంతర సంస్కరణలే వృద్ధికి ఆధారం



న్యూఢిల్లీ: మన జనప్రగతి అక్టోబర్ 13:భారత్ ఎవరి ప్రయోజనాలకూ భంగం కలిగిస్తూ అభివృద్ధి చెందడం లేదని, ప్రపంచంతో కలిసి, ప్రపంచం కోసం ఎదుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలమైన పునాదులపై ముందుకు సాగుతోందని, నిరంతర సంస్కరణలు వృద్ధికి దోహదపడుతున్నా యని పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ఆయన ప్రసంగించారు.ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య అంతరాయాలు, కీలక సాంకేతిక పరిజ్ఞానాలు, వనరుల కోసం పోటీ పెరుగుతున్న నేపథ్యంలో భారత్ విశ్వసనీయ ఆర్థిక భాగస్వామిగా మిగతా2లో...

ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ నేడు విడుదల!



అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 13: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ బుధవారం ఉదయం 11.30 గంటలకు విడుదలయ్యే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడనున్నట్లు సమాచారం. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మున్సిపల్, ఎంపీటీసీ జడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను మిగతా2లో...

ఓటు చోరీపై ఐక్య పోరాటం

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఉద్యమం ఉధృతం
- ఇండియా కూటమి నేతల సమావేశంలో నిర్ణయం



న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 13: దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై పోరాటాన్ని ఉధృతం చేయాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేపట్టిన ఉద్యమాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు. మంగళవారం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాసంలో జరిగిన సమావేశంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు, పౌరసమాజ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సమావేశానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మిగతా2లో...

కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- పోలీసు నియామక నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలి: కల్వకుంట్ల కవిత

2లో

అమరావతిలో 47 అంతస్తుల ట్విన్ టవర్స్

క్వాంటం వ్యాలీలో నిర్మాణాలకు మంత్రి నారాయణ శంకుస్థాపన



అమరావతి, మన జనప్రగతి అక్టోబర్ 13: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలోని క్వాంటం వ్యాలీలో మరో కీలక అడుగు పడింది. క్వాంటం వ్యాలీ ట్విన్ టవర్స్ నిర్మాణానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ పనులను ప్రారంభించారు.ఉద్దండరాయునిపాలెంలోని క్వాంటం వ్యాలీలో సుమారు 11 ఎకరాల విస్తీర్ణంలో ఈ జంట భవనాలను నిర్మించనున్నారు. ఒక్కో భవన సముదాయం 47 అంతస్తులతో, 206 మీటర్ల ఎత్తులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన నిర్మించనున్న ఈ ట్విన్ టవర్స్ అమరావతికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.క్వాంటం సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంలో భాగంగా ఈ నిర్మాణాలు చేపడుతున్నారు. అత్యాధునిక సాంకేతిక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను ముందంజలో నిలిపేందుకు క్వాంటం వ్యాలీ ప్రాజెక్టు కీలకంగా మారనుందని ప్రభుత్వం భావిస్తోంది.

కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లి జాతర వైభవం

అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు

2లో

రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే యత్నం!


2లో

జంతర్ మంతర్‌లోకి సీజేపీ నేతలు

- అశుతోష్ రంకా, సౌరవ్ దాస్ సహా పలువురు కార్యకర్తల నిర్బంధం



న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 13: దేశ రాజధాని ఢిల్లీలో దశాబ్దాలుగా నిరసనలకు వేదికగా నిలిచిన జంతర్ మంతర్‌ను ఆందోళన స్థలాల జాబితా నుంచి

మిగతా2లో...

ప్రపంచంతో కలిసి ఎదుగుతున్న భారత్

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తోందని మోదీ తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసిందని, విదేశీ మారక నిల్వలు 700 బిలియన్ డాలర్లను దాటాయని చెప్పారు.పన్నుల విధానం, దివాలా పరిష్కార వ్యవస్థ, కార్మిక చట్టాల్లో చేపట్టిన సంస్కరణలు దేశ ఆర్థిక పటిష్ఠతకు నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో జీడీపీలో నాలుగు శాతానికి పైగా ఉన్న కరెంట్ అకౌంట్ లోటు ప్రస్తుతం సుమారు అర శాతానికి తగ్గిందని వివరించారు. అనిశ్చితులతో నిండిన ప్రపంచంలో భారత్ విశ్వసనీయత, స్థిరత్వానికి ప్రతీకగా నిలుస్తోందని అన్నారు. **ఇతరులకు అవకాశాలు కల్పించడమే నిజమైన శక్తి**ఒక దేశానికి ఎంత శక్తి ఉందన్నది మాత్రమే కాకుండా, ఆ శక్తిని ఇతరులకు అవకాశాలు కల్పించేందుకు ఎలా ఉపయోగిస్తుందన్నదే ముఖ్యమని మోదీ అభిప్రాయపడ్డారు. తన అభివృద్ధి విధానాన్ని 'సాధికారత కల్పించే శక్తి'గా అభివర్ణించారు. పోటీ పడటానికే కాకుండా, ఇతరులతో కలిసి పనిచేయడానికి, ఇతరులు కూడా విజయం సాధించేలా సహకరించడానికి శక్తిని వినియోగించాలని సూచించారు. డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, అంకుర సంస్థల విస్తరణ, స్వచ్ఛ ఇంధన సామర్థ్యాలు సమ్మిళిత అభివృద్ధికి దోహదపడుతున్నాయని తెలిపారు.

డిజిటల్ గుర్తింపు, చెల్లింపులు, ప్రజా మౌలిక సదుపాయాల రంగాల్లో భారత్ సాధించిన అనుభవాన్ని ఇతర దేశాలతో, ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాలతో పంచుకుంటున్నామని చెప్పారు. **అంతర్జాతీయ సహకారానికి పిలుపు**సరఫరా వ్యవస్థలు, ఇంధనం, కీలక ఖనిజాలు, చెల్లింపుల వ్యవస్థలు, సాంకేతిక పరిజ్ఞానం వంటివి అంతర్జాతీయ రాజకీయ ఒత్తిడికి సాధనాలుగా మారుతున్నాయని మోదీ హెచ్చరించారు. ఇలాంటి పరిస్థితుల్లో విశ్వసనీయ భాగస్వాములు, సంక్షోభాలను తట్టుకోగల ఆర్థిక వ్యవస్థలు అవసరమని పేర్కొన్నారు.

విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, ప్రపంచ సరఫరా వ్యవస్థల్లో భారత పాత్రను విస్తరించడం, అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో ఆర్థిక భాగస్వామ్యాలను బలోపేతం చేయడం లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందని తెలిపారు. దేశం సాధిస్తున్న పురోగతి భారతదేశానికే పరిమితం కాకుండా, ఇతర దేశాలకు సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, పరిష్కారాలను అందించే అవకాశాలను కూడా సృష్టిస్తుందని మోదీ పేర్కొన్నారు.సంస్కరణలు తప్పనిసరి పరిస్థితుల్లో చేపట్టేవి కావని, అవి తమ దృఢ విశ్వాసానికి ప్రతీకలని ప్రధాని స్పష్టం చేశారు.

ఓటు చోరీపై ఐక్య పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, తేజస్వి యాదవ్, సుప్రియా సూలే, ఎం.ఎ. బేబీ, డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య, సంజయ్ రౌత్ తదితరులు హాజరయ్యారు. ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల హక్కుల పరిరక్షణ, నిరసనలకు సంబంధించిన అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్షాలన్నీ ఐక్యంగా పోరాడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎన్నికల వ్యవస్థను పునరుద్ధరించేందుకు చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యక్తీకరణకు వేదికగా ఉన్న జంతర్ మంతర్ వద్ద నిరసనలను అడ్డుకోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తామని తెలిపారు.ఎన్నికల సంఘం పనితీరుపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు.

ఓటర్ల హక్కులను కాపాడేందుకు విద్యార్థి సంఘాలు, పౌరసమాజ ప్రతినిధులు, ప్రజలు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. సీపీఐ నేత డి.రాజా జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా కొనసాగించా లని కోరారు. ఓటు హక్కు, రాజ్యాంగ పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ఇండియా కూటమి నేతలు స్పష్టం చేశారు.

రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌కు

ఎసరు పెట్టే యత్నం!

జీవో 17ను ఉపసంహరించుకోవాలి.. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌పై లిఖితపూర్వక హామీ ఇవ్వాలి

బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 13: రైతు డిస్కం ఏర్పాటు పేరుతో వ్యవసాయానికి అందిస్తున్న ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే ప్రయత్నం జరుగుతున్నదని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. రైతు డిస్కం ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 17ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు నిరంతరాయంగా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా కొనసాగుతుందని ప్రభుత్వం లిఖితపూర్వక హామీ ఇవ్వాలని కోరారు.రైతులు, విద్యుత్ ఉద్యోగ సంఘాలు, రంగ నిపుణులు లేవనెత్తుతున్న అభ్యంతరాలను పట్టించుకోకుండా ప్రభుత్వం ముందుకు వెళ్లడం సరికాదని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొత్త డిస్కం ఏర్పాటు వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు ఏమిటో ప్రభుత్వం స్పష్టంగా వివరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు, తక్కువ వోల్టేజీ వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కొత్త వ్యవస్థతో ఈ సమస్యలకు పరిష్కారం ఎలా లభిస్తుందో చెప్పాలని ప్రశ్నించారు.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కొత్త రైతు డిస్కం పరిధిలోకి 30,62,853 విద్యుత్ కనెక్షన్లను బదిలీ చేస్తున్నారని హరీశ్‌రావు తెలిపారు. వీటిలో 30,60,861 వ్యవసాయ కనెక్షన్లతో పాటు 512 ఎత్తిపోతల పథకాలు, మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు సంబంధించిన కనెక్షన్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంత పెద్ద వ్యవస్థను కేవలం 2,000 మంది సిబ్బందితో ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల నిర్వహణకు తగిన సిబ్బంది లేకపోతే తలెత్తే సమస్యలకు ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు.కొత్త డిస్కంకు విద్యుత్ కేటాయింపులపైనా హరీశ్‌రావు సందేహాలు వ్యక్తం చేశారు. థర్మల్ విద్యుత్‌లో 25 శాతం, సౌర విద్యుత్‌లో 58 శాతం, జల విద్యుత్‌లో 100 శాతం కేటాయించినట్లు పేర్కొన్నారు. సౌర విద్యుత్ ప్రధానంగా పగటిపూటే అందుబాటులో ఉంటుందని, జల విద్యుత్ ఉత్పత్తి కూడా కాలానుగుణంగా మారుతుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా ఎలా కొనసాగిస్తారని ప్రశ్నించారు.కొత్త డిస్కంకు భారీ మొత్తంలో అప్పులు, బకాయిలను బదిలీ చేయడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంస్థ ఆర్థిక స్థిరత్వానికి ప్రభుత్వం ఎలాంటి భరోసా ఇస్తుందో వెల్లడించాలని కోరారు. అదనపు పరిపాలనా ఖర్చులు, ఉద్యోగుల బదిలీ, ఆస్తులుఅప్పుల పంపిణీపై పూర్తి వివరాలు ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నష్టాల పేరుతో భవిష్యత్తులో రైతుల ఉచిత విద్యుత్‌పై ఆంక్షలు విధించే పరిస్థితి రాకుండా స్పష్టమైన హామీలు ఇవ్వాలని కోరారు.రైతుల అభ్యంతరాలను పరిష్కరించకుండా ఏకపక్షంగా ముందుకు వెళ్లవద్దని హరీశ్‌రావు ప్రభుత్వానికి సూచించారు. రైతు డిస్కం ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలు, విద్యుత్ సరఫరా విధానం, ఆర్థిక నిర్వహణపై సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగింపుపై భరోసా ఇవ్వలేని పక్షంలో జీవో నంబర్ 17ను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు.

ఎల్బీనగర్, హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం

తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు

పలు ప్రాజెక్టులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలం : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్:మన జనప్రగతి అక్టోబర్ 13: రాష్ట్రాభివృద్ధికి ఊతమిచ్చే పలు మౌలిక వసతుల ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం లభించడం తెలంగాణ అభివృద్ధికి కీలక ముందడుగు అని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి కోమటిరెడ్డి భేటీ అయ్యారు. పలు కీలక ప్రాజెక్టులపై చర్చించారు.ఎన్‌హెచ్65 హైదరాబాద్ విజయవాడ మచిలీపట్నం రహదారి విస్తరణ పనులను జనవరిలో ప్రారంభిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు కోమటిరెడ్డి తెలిపారు. కృష్ణా నదిపై సోమశిల వద్ద ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు అంగీకారం తెలిపారని



వెల్లడించారు. తెలంగాణలో ఐదు రోప్‌వేలు, మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి ఆమోదం లభించిందన్నారు. హైదరాబాద్‌శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌పై కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని ఆదేశించినట్లు చెప్పారు. 34 రహదారి పనులకు కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) కింద నిధుల కోసం కేంద్ర అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.హైదరాబాద్‌అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రతిపాదనపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఎన్‌హెచ్167కెపై కృష్ణా నదికి అడ్డంగా సోమశిల నుంచి సంగమేశ్వరం వరకు నిర్మించనున్న ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి పూర్తయితే తిరుపతి వెళ్లే ప్రయాణికులకు సుమారు 80 కిలోమీటర్ల దూరం, మూడు గంటల ప్రయాణ సమయం తగ్గుతుందని వివరించారు. ఈ వంతెనతో పర్యాటక అభివృద్ధికి, స్థానికంగా ఉపాధి అవకాశాల పెరుగుదలకు దోహదం కలుగుతుందని తెలిపారు.తెలంగాణలో పర్యాటక ప్రాంతాలకు సులభంగా చేరుకునేందుకు పర్వతమాల పథకం కింద ఐదు రోప్‌వేల ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందన్నారు. హైదరాబాద్‌లో జరగనున్న భారతీయ రహదారుల కాంగ్రెస్ (ఐఆర్సీ) కార్యక్రమానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ హాజరవుతారని చెప్పారు. రాష్ట్రం లో రహదారి వ్యవస్థను బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించే ందుకు ఈ సమావేశం దోహదపడుతుందని ఆశాభా వం వ్యక్తం చేశారు. ఈ భేటీలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.

ఐదు నదుల అనుసంధానమే లక్ష్యం!

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్తులో ఐదు నదులను కలిపే దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఈ ప్రయత్నాలకు కనకదుర్గమ్మ ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. **2047 నాటికి భారత్ అగ్రస్థానంలో** 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానానికి చేరుకుంటుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. దేశంలో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం, విజ్ఞానం ఉన్నాయని, వీటికి ఆధ్యాత్మికత తోడైతే మరింత పురోగతి సాధించవచ్చని అన్నారు. విజయవాడ ఉత్సవ్‌లో నిర్వహించిన వివిధ కళా ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవానికి విశేష ఆదరణ అందించారని చెప్పారు.ఈ సందర్భంగా తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను చంద్రబాబు ఘనంగా సత్కరించారు. రెండు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, నదుల అనుసంధానం వంటి అంశాలకు ఈ కార్యక్రమం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ నేడు విడుదల!

(మొదటి పేజీ తరువాయి)

మూడు దశల్లో నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జడ్పీ చైర్మన్ పదవుల రిజర్వేషన్ల ఉత్తర్వులు మంగళవారం రాత్రి విడుదలైనట్లు సమాచారం.

కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లి జాతర వైభవం

కోటబొమ్మాళి, మన జనప్రగతి అక్టోబర్ 13: శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి 101వ జాతర ఉత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉత్సవాలను ప్రారంభించారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి పట్టువస్త్రాలు, సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. అమ్మవారి కరుణాకటాక్షాలు తమపై ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అగరబత్తులను మంత్రులతో పాటు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వెలిగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. **ఆకట్టుకున్న సంప్రదాయ పోటీలు** జాతరలో భాగంగా జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన సంగిడీ, ఈడుపురాయి పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సంగిడీ పోటీలో ఒప్పంగి గ్రామానికి చెందిన గేదెల సత్యనారాయణ ప్రథమ బహుమతి సాధించారు. ఈడుపురాయి పోటీలో నిమ్మాడ గ్రామానికి చెందిన ఆవాల గోవిందరావు మొదటి స్థానంలో నిలిచారు. సంగిడీ పోటీలోనూ ఆయన ద్వితీయ స్థానం దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. సంప్రదాయాలు, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన కొత్తమ్మతల్లి జాతర భక్తుల సందడితో కోటబొమ్మాళిలో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చింది.

జంతర్ మంతర్‌లోకి సీజేపీ నేతలు

(మొదటి పేజీ తరువాయి)

తొలగించిన మరుసటి రోజే సీజేపీ నేతలు అక్కడికి ప్రవేశించి నిరసన చేపట్టారు. మంగళవారం తెల్లవారుజామున జాతీయ జెండాలను చేతబూనిన కార్యకర్తలు బారికేడ్లు, గేట్లు దాటి జంతర్ మంతర్ వద్దకు చేరుకున్నారు. అయితే అక్కడ అప్పటికే మోహరించిన పోలీసులు సీజేపీ నేతలు అశుతోష్ రంకా, సౌరవ్ దాస్, అజింక్య షిండేతో పాటు పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. నిరసనకారులు జాతీయ జెండాలు పట్టుకుని 'భారత్ మాతాకీ జై', 'ఇంక్విలాబ్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కొద్దిసేపటికే పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. **నిరసన హక్కును అడ్డుకోలేరు**జంతర్ మంతర్‌ను నిరసనల వేదికగా తొలగించడం, తమ పార్టీ నేతలను నిర్బంధించడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. జంతర్ మంతర్ కేవలం ఒక ప్రాంతం మాత్రమే కాదని, ప్రజల నిరసన హక్కుకు ప్రతీక అని పేర్కొన్నారు. అధికారికంగా నిరసన వేదికను తొలగించవచ్చేమో కానీ, ప్రజల స్ఫూర్తిని అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు.జంతర్ మంతర్‌లోకి ప్రవేశించడాన్ని సీజేపీ నేతల విజయంగా అభివర్ణించారు. దేశంలో నియంతృత్వ ధోరణి కొనసాగుతోందని, పాలకులు నిబంధనలను విస్మరిస్తున్నారని విమర్శించారు. పార్టీ ముఖ్య నేతలను అదుపులోకి తీసుకుని వేర్వేరు ప్రాంతాల్లో నిర్బంధించారని, వారితో పాటు ఉన్న 11 మంది కార్యకర్తలను మరో ప్రాంతానికి తరలించారని తెలిపారు. **ఉద్యమాన్ని కొనసాగించాలని పిలుపు**సీజేపీ న్యాయ విభాగం ప్రతినిధి రత్నాసింగ్‌తో మాట్లాడినట్లు అభిజీత్ దీప్కే తెలిపారు. న్యాయవాదులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినప్పుడు వారిని లోపలికి అనుమతించలేదని ఆరోపించారు. తమ పార్టీకి చెందిన ఇతరులను కూడా అదుపులోకి తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారని వెల్లడించారు.యువత తమ హక్కుల కోసం ఉద్యమాన్ని కొనసాగించాలని సౌరవ్ దాస్ పిలుపునిచ్చారు. జంతర్ మంతర్ నిరసనల వేదికగా కొనసాగాలని అశుతోష్ రంకా పేర్కొన్నారు. నిరసనలకు ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాలను సూచించిన నేపథ్యంలో జంతర్ మంతర్ అంశం రాజకీయంగా చర్చనీయాంశమైంది.

కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

- పోలీసు నియామక నోటిఫికేషన్‌లో మార్పులు చేయాలి: కల్వకుంట్ల కవిత



హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 13: ఏజెన్సీ ప్రాంతాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎస్టీలకు దక్కాల్సిన 75 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది పోలీసు నియామక బోర్డు విడుదల చేసిన నోటిఫికేషన్‌లో గిరిజన రిజర్వేషన్లను విస్మరించారని ఆమె ఆరోపించారు. గతంలో 2015, 2018, 2022 నియామకాల్లో ఈ రిజర్వేషన్లు అమలయ్యాయని గుర్తుచేశారు. తాజా నోటిఫికేషన్‌లో మార్పులు చేసి గిరిజన యువతకు న్యాయం చేయాలని కోరారు.ఈ నోటిఫికేషన్ వల్ల ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల గిరిజన అభ్యర్థులు నష్టపోయే ప్రమాదం ఉందని కవిత పేర్కొన్నారు. 400కు పైగా కానిస్టేబుల్ ఉద్యోగాలు గిరిజన యువతకు దక్కకుండా పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి నియామక నోటిఫికేషన్‌లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గిరిజన యువతతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

మధ్యవర్తిత్వంతో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులకు పరిష్కారం





పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 13:-సుదీర్ఘకాలంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం ఎంతగానో దోహదపడుతుందని ప్యానెల్ న్యాయవాది సూరజ్ నబీ, మధ్యవర్తిత్వ న్యాయవాది శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.మంగళవారం కర్నూలు జిల్లా పత్తికొండలోని స్టేట్ బ్యాంక్, ఆదోని రహదారి ప్రాంతాల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యవర్తిత్వం ద్వారా కేసులను ఎలా పరిష్కరించుకోవచ్చో వివరించడంతో పాటు, ప్రజలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ, ప్రజలు సత్వర న్యాయం పొందేందుకు లోక్ అదాలత్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు, ఇరుపక్షాల మధ్య పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోదగిన వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు.కేసుల పరిష్కారానికి ఇరుపక్షాల కక్షిదారులకు న్యాయస్థానం ద్వారా ఉచిత మధ్యవర్తిత్వ న్యాయవాదుల సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని, సమయం, ఖర్చు ఆదా చేసుకుంటూ తమ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ ఆర్. శ్రీనివాస్ నాయక్, న్యాయవాది మదన్ గోపాల్ గౌడ్, లోక్ అదాలత్ ప్రతినిధి రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నిత్య పూజేశ్వరుని తలనీలాల వేలం రూ.4.84 లక్షలు



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 13:-లంకమల అభయారణ్యంలో వెలసిన శ్రీ నిత్య పూజేశ్వర స్వామివారి కార్తీక మాస తలనీలాల వేలంపాట రూ. 4,84,000లకు ప్రొద్దుటూరుకు చెందిన మునిశేఖర్ దక్కించుకున్నారు. మంగళవారం సిద్ధవటంలోని శ్రీ రంగనాథ స్వామి ఆలయంలో దేవాదాయ శాఖ అధికారులు వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో ప్రొద్దుటూరు, గుంతకల్, చాపాడు, వంతాటిపల్లి గ్రామాలకు చెందిన పలువురు పాల్గొన్నారు. దేవస్థానం నిర్ణయించిన రూ.3 లక్షల కనీస ధరను అధిగమించి, మునిశేఖర్ అత్యధికంగా రూ.4.84 లక్షలకు వేలంపాటను దక్కించుకున్నారు. నవంబర్ 10 నుంచి డిసెంబర్ 8 వరకు కార్తీక మాసంలో భక్తులు స్వామివారికి మొక్కుబడిగా సమర్పించే తలనీలాల సేకరణకు ఈ వేలంపాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో పి. సురేష్ కుమార్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, పాలకవర్గ సభ్యుడు శివారెడ్డి, ఆలయ సిబ్బంది చంద్ర, వంతాటిపల్లి గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

- ఏఎస్పీ జై శర్మకు వినతిపత్రం అందజేసిన ఎస్ఎఫ్ఐ నాయకులు



ఆదోని మన జనప్రగతి అక్టోబర్ 13:-మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులను అరికట్టి, వారికి సత్వర న్యాయం అందించేందుకు ఆదోనిలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సంజయ్, శశిధర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆదోని ఏఎస్పీ జై శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రస్తుతం మహిళా పోలీస్ స్టేషన్ కర్నూలులో ఉండటంతో ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల మహిళలు ఫిర్యాదుల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. సుమారు 120 నుంచి 150 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి రావడం, రవాణా సౌకర్యాల కొరతతో మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.గృహ హింస, కుటుంబ సమస్యలు, వేధింపులు, లైంగిక వేధింపులకు గురవుతున్న మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా వెల్లడించేందుకు మహిళా పోలీసు అధికారులు అందుబాటులో ఉండటం అవసరమన్నారు. ఐదు నియోజకవర్గాల మహిళల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆదోనిలో మహిళా సీఐతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించి ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించి, ఆదోనిలో మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు.

అన్నపూర్ణాదేవి అలంకారంలో మంగళగౌరి అమ్మవారు



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబరు 13:-మండలంలోని మాధవరం-1 గ్రామంలో వెలసిన శ్రీ మంగళగౌరి సమేత అమరలింగేశ్వర స్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడో రోజు మంగళగౌరి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారిని వివిధ అలంకారాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రతి గ్రామములో వీబీజీ రామ్ జీ పథకం కింద శ్రామికులకు పనులు కల్పించాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 13:-ప్రతి గ్రామములో వీబీజీ రామ్ జీ పథకం కింద శ్రామికులకు పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు.మంగళవారం ఓర్వకల్లు మండలంలోని హుస్సేనాపురం గ్రామంలో జలధార – జలహారతి 2.0 కింద చేపడుతున్న నీటి సంరక్షణ పనులను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీబీజీ రామ్ జీ పథకం కింద నీటి సంరక్షణ పనులు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేని వారికి వీబీజీ రామ్ జీ పథకం కింద పనులు కల్పించాలని, పనులు కల్పించలేదనే ఫిర్యాదులు ఎక్కడ రాకూడదని కలెక్టర్ డ్వామా పిడి ని ఆదేశించారు.వీబీ – జీ రామ్ జీ పథకం కింద శ్రామికులకు తగిన పనిదినాలు కల్పించడంతో పాటు, వారికి అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ డ్వామా పిడి ని ఆదేశించారు.. నీటి సంరక్షణ పనులను పరిశీలిస్తూ పనులకు ఎంతమంది శ్రామికులు హాజరవుతున్నారు, ఉదయం ఏ సమయానికి పనులకు వస్తున్నారు, శ్రామికులకు తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పిస్తున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో శ్రామికులకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శ్రామికులతో మాట్లాడుతూ రోజువారీ వేతనాలు సక్రమంగా అందుతున్నాయా, ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రేషన్ సరుకులు సకాలంలో పంపిణీ చేస్తున్నారా, అర్హులైన వారికి ఉచిత గ్యాస్ సిలిండర్లు అందుతున్నాయా అనే వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు లేని అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి, వారికి గృహ నిర్మాణ పథకం కింద దరఖాస్తులు స్వీకరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ హౌసింగ్ పిడి ని, ఓర్వకల్లు తహసిల్దార్ లను ఆదేశించారు. రెండు రోజుల్లోగా అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల సేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ ఓర్వకల్లు తహసిల్దార్ ను ఆదేశించారు.కార్యక్రమంలో డ్వామా పిడి నరసింహా రెడ్డి, ఓర్వకల్లు తహసిల్దార్ విద్యా సాగర్, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

- హుసేనాపురం హౌసింగ్ లేఔట్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 13:-గృహ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లను అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామంలోని హౌసింగ్ లేఔట్‌లో ఆమె ఆకస్మికంగా పర్యటించి, వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్ల పనుల పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా బేస్‌మెంట్, రూఫ్ లెవల్, ఆర్సీ లెవల్, మరుగుదొడ్ల నిర్మాణం, తుది దశ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లుల సమర్పణ, ఆమోదం, చెల్లింపుల ప్రక్రియను సమీక్షించారు. బిల్లులను సకాలంలో పూర్తి చేసి, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు.సిమెంట్, స్టీల్, ఇసుక, ఇటుకలు తదితర నిర్మాణ సామగ్రి ధరలు, కూలీల ఖర్చులు, ఇళ్ల నిర్మాణానికి అవుతున్న వ్యయాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ సామగ్రి అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు, ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. పిల్లర్లు, స్లాబ్ నిర్మాణం, లీకేజీల నివారణ వంటి సాంకేతిక అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సమస్యలు తలెత్తినప్పుడు ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు.హౌసింగ్ లేఔట్‌లో తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై కలెక్టర్ ఆరా తీశారు. లబ్ధిదారులకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అనంతరం నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను సందర్శించిన కలెక్టర్, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి నిర్మాణానికి అయిన ఖర్చు, నిర్మాణ పనుల వివరాలపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నరసింహారెడ్డి, తహశీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో ఎం. నాగ అనసూయ తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల అర్బన్ పీఎస్ కమాండ్ కంట్రోల్ హెల్ప్‌లైన్ ప్రారంభించిన ఎస్పీ

ఆపదలో ఉన్నవారికి తక్షణ సాయమే లక్ష్యం
కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 13: ప్రజలకు రక్షణ,సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అత్యాధునిక కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 9490864264 ను వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐ.పి.ఎస్.మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ,నేరాల నియంత్రణ, ఆపదలో ఉన్నవారికి తక్షణ సాయం అందించేందుకు ఈ హెల్ప్‌లైన్ ఎంతో దోహదపడుతుందని స్పష్టం చేశారు.స్థానిక ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో లేదా సమస్యలు ఎదురైనప్పుడు నిర్భయంగా ఈ నంబర్‌కు సమాచారం అందించాలని పిలుపునిచ్చారు.కంట్రోల్ సెంటర్‌కు వచ్చే ప్రతి కాల్‌పై సిబ్బంది వెంటనే స్పందించి,క్షేత్రస్థాయిలో బాధితులకు తగిన సహాయం అందించాలని పోలీసు అధికారులను ఆదేశించారు.పోలీస్ శాఖలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ప్రజలకు మరింత వేగవంతమైన,పారదర్శకమైన సేవలు అందించడమే తమ ప్రాధాన్యత అని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ బి.మురళి నాయక్ అర్బన్ సీఐ పురుషోత్తం రాజు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్.సి. మునికృష్ణకు టికెట్ ఇవ్వొద్దు

● స్థానికులకే అవకాశం ఇవ్వాలని కూటమి నేతల విజ్ఞప్తి



తిరుపతి, మన జనప్రగతి, అక్టోబర్ 12:-

మాజీ డిప్యూటీ మేయర్, మాజీ 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్.సి. మునికృష్ణకు 47వ డివిజన్ నుంచి టీడీపీ కార్పొరేటర్ టికెట్ ఇవ్వవద్దని స్థానిక కూటమి నాయకులు కోరారు.భవానీనగర్‌లో మాజీ కౌన్సిలర్ నాగభూషణం అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ, మునికృష్ణ గతంలో కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ప్రజలకు అందుబాటులో లేరని, వార్డు అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపలేదని ఆరోపించారు.రాబోయే తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ఆర్.సి. మునికృష్ణకు కాకుండా స్థానికులకు టికెట్ ఇస్తే అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. భవానీనగర్‌కు చెందిన మైనం బాలాజీ, రవితేజ నాయుడు పేర్లను స్థానిక నాయకులు అభ్యర్థులుగా ప్రస్తావించారు. పార్టీ అధిష్ఠానం, జిల్లా నాయకత్వం ఈ విషయాన్ని పరిశీలించాలని కోరారు.

శారద దేవి అలంకారంలో శ్రీశ్రీశ్రీ దుర్గా మాతాజీ



రామాపురం మన జనప్రగతి అక్టోబర్ 13:-మండలంలోని నీలకంఠరావుపేట గ్రామం దర్బార్ సాయి నగరంలో వెలసిన శ్రీశ్రీశ్రీ దుర్గామాతజి నవరాత్రి ఉత్సవాలు భాగంగా మంగళవారం శారద దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు ఈ ఉత్సవాల్లో వేద పండితులు అమ్మవారికి కలశ పూజా నైవేద్య కైంకర్యాలు నిర్వహించి విశేష అలంకారంతో భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. వచ్చిన భక్తాదులకు అమ్మవారి దర్శనంతో పాటు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్ర మాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు సత్యమయ్య స్వామి శంకరయ్య స్వామిలు తెలియజేశారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అమ్మవారికి విశేషమైన అలంకరణలు, అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని భక్తులు అమ్మవారిని దర్శించుకుని కృపా కటాక్షం పొందాలని తెలియజేశారు.

లింగంపల్లి ప్రభుత్వ భూమి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 13:-కడప జిల్లా సిద్ధవటం మండలం లింగంపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 164లో ఉన్న భూమి వద్ద రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. రీసెటిల్‌మెంట్ రిజిస్టర్ (ఆర్ఎస్ఆర్) ప్రకారం 101.09 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ భూమి కొండ, ప్రభుత్వ భూమిగా నమోదై ఉందని అధికారులు తెలిపారు. ఈ భూమికి సంబంధించి సిద్ధవటం కోర్టులో ఓ.ఎ. నంబర్లు 06/2025, 07/2025, 65/2026 కింద కేసులు విచారణలో ఉన్నాయని పేర్కొన్నారు. కోర్టు తుది తీర్పు వెలువడిన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని, అప్పటివరకు సదరు భూమిని ప్రభుత్వ భూమిగానే పరిగణిస్తామని వీఆర్వో రజిని, వీఆర్ఏ కిషోర్ స్పష్టం చేశారు.

మానసా దేవి ఆలయానికి పోటెత్తిన మహిళా భక్తులు



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 13:-కడపచెన్నై జాతీయ రహదారిలోని కనుమలోపల్లి సమీపంలో వెలసిన శ్రీ మానసా దేవి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు మంగళవారం మహిళా భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు మాట్లాడుతూ, ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజుల్లో అమ్మవారిని దర్శించుకుంటామని తెలిపారు. ఆలయ ధర్మకర్త లక్ష్మయ్య భక్తులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, ఆలయానికి వచ్చే ప్రతి ఒక్కరికీ అన్నప్రసాద వితరణ చేపడుతున్నారని పేర్కొన్నారు. భక్తుల కుటుంబ సమస్యలు, ఆరోగ్య సమస్యలు తొలగిపోవాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారి దర్శనం



పత్తికొండ మన జన ప్రగతి అక్టోబర్ 13:-శరన్నవరాత్రుల సందర్భంగా పత్తికొండ పట్టణంలోని కుమ్మరి వీధిలో శ్రీ అన్నపూర్ణాదేవి అవతారంలో కొలువుదీరిన అమ్మవారికి మూడవ రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పత్తికొండ మాజీ మండల అధ్యక్షురాలు ఎస్.ఆర్. నాగరత్నమ్మ అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వారిపై చర్యలకై కలెక్టరుకు వినతి



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 13:-తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తితో పాటు అతని తల్లి అన్నలపై మోసం కేసుతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సామర్లకోట బ్రౌన్ పేటకు చెందిన మోరాల శిరీష అనే యువతి ఫిర్యాదు చేసింది. దీనికి సంబంధించిన వివరాలను ఆమె మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విలేకరులకు వివరించింది. తాను పెద్దాపురం మండలం రాగంపేటలో ఉన్న రొయ్యల కంపెనీలో సెక్యూరిటీ గార్డ ఉద్యోగం చేస్తున్నానని అదే కంపెనీలో సామర్లకోట మండలం మాధవపట్నం గ్రామానికి చెందిన కోశెట్టి నాని అనే వ్యక్తి వెహికల్ ఇన్చార్జిగా ఉద్యోగం చేస్తున్నారన్నారు. తామిద్దరం ప్రేమించుకున్నామని ఈ విషయాన్ని నాని ఐదు రోజుల క్రితం తన తల్లితో మాట్లాడేందుకు వచ్చారన్నారు. అక్కడ కొందరు పోలీసులకు ఫోన్ చేయడంతో వారు వచ్చి నానిని పోలీస్ స్టేషన్కి తీసుకుని వెళ్లారని అప్పుడు నేను వెళ్ళి మేమిద్దరం ప్రేమించుకుంటున్నామని వాళ్లకు చెప్పానన్నారు. అయినా పోలీసులు తన మాట వినకుండా నాని కుటుంబ వివరించి అడిగి నాని కుటుంబ సభ్యులు దుర్భాషలాడి మా కులం మీ కులం వేరని వివాహం చేసుకోమని పోలీసులు ముందే నాని కుటుంబ సభ్యులు తనను తిట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మాధవపట్నం గ్రామానికి చెందిన పెద్దలు తనను కేసును రాజీ చేసుకోవాలని లేకపోతే నీపై తిరిగి కేసు పెడతామని చెప్పి నాతో కేసు రాజీ చేయించా రన్నారు. నా కులాన్ని నన్ను హీనంగా మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో మాధవపట్నంలోని నాని నిరసన దీక్ష చేస్తానన్నారు. అలాగే నాని కుటుంబ సభ్యులు నాని తల్లి రత్నం, అన్నయ్య కోశెట్టి శీనులపై మోసం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని శిరీష కోరారు.

అనంతరాజు పేటలో ఉచిత కంటి వైద్య శిబిరం



చిట్వేలి మనజనప్రగతి అక్టోబర్ 13:-అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవాన్ని పురస్కరించు కుని అనంతరాజుపేట గ్రామ పంచాయతీ పెద్దలు, మాజీ ఎంపీటీసీ బండారు మల్లికార్జున ఆధ్వర్యంలో తిరుపతి అమెరికన్ లేజర్ కంటి ఆసుపత్రి సహకారంతో అక్టోబర్ 15న ప్రత్యేక కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీటీసీ బండారు మల్లికార్జున తెలిపారు. అనంతరాజుపేట గ్రామ పంచాయతీ సమీపంలోని ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు శిబిరం జరుగనుంది. అమెరికన్ లేజర్ ఐ హాస్పిటల్, మార్కెటింగ్ మేనేజర్ వసంత్ జేష్టాది మాట్లాడుతూ కంటి చూపు, కంటి పవర్, కాటరాక్ట్, పేటరీజియం, రెటినా సంబంధిత ప్రాథమిక పరీక్షలతో పాటు వైద్యుల సలహాలు, తదుపరి చికిత్సకు మార్గదర్శకత్వం అందించనున్నారని తెలిపారు. కంటి వైద్య సేవలు, అత్యాధునిక పరీక్షా పరికరాలు, అవసరాన్ని బట్టి లేజర్ చికిత్సా సదుపాయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ, ఆరోగ్య బీమా పథకాల ద్వారా అందుబాటులో ఉన్న సేవలపై కూడా మార్గదర్శకత్వం అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా బండారు మల్లికార్జున మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం, ముఖ్యంగా మహిళలు కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తగిన సమయంలో పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించడం ఈ శిబిరం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కోడూరు మండలం, అనంతరాజుపేట పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 74162 97028 ఈ నెంబర్ ను సంప్రదించాలని కోరారు

రైల్వే కోడూరులో ఘనంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

- అక్టోబర్ 11 నుంచి 22 వరకు అమ్మవారికి వివిధ అలంకరణలతో ప్రత్యేక పూజలు





రైల్వే కోడూరు మన జనప్రగతి అక్టోబర్ 13:-దసరా పండుగను పురస్కరించుకుని రైల్వే కోడూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 11వ తేదీ నుంచి 22వ తేదీ వరకు 12 రోజుల పాటు అమ్మవారికి వివిధ అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సంఘం అధ్యక్షుడు పిండ్యాల విజయకుమార్, ఉపాధ్యక్షుడు కలువ మురళి ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల సహకారంతో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మహోత్స వాల్లో భాగంగా అక్టోబర్ 11న దీక్షాబంధనం, అమ్మవారి అలంకరణతో పూజా కార్యక్రమాలు ప్రారంభమ య్యాయి. రెండో రోజు జగన్మోహిని అలంకరణలో అమ్మవారిని పూజించారు. అనంతరం వనవిహారిణి, అన్నపూర్ణ, గజలక్ష్మి, సరస్వతీదేవి, గౌరీ పూజ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వైష్ణవ జనమార్దిని అలంకరణతో పాటు ఈ నెల 19న గుండ ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సంఘం అధ్యక్షుడు తెలిపారు.గుండ ప్రవేశం కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా అగ్నికుండాన్ని ఏర్పాటు చేసి ఆర్యవైశ్య సంప్రదాయాల ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అనంతరం కాళింగమర్దిని, మహాలక్ష్మి అలంకరణలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరపనున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.మహోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులందరూ ఐకమత్యంతో కృషి చేస్తున్నారని పిండ్యాల విజయకుమార్ తెలిపారు. ఉత్సవాల నిర్వహణకు సహకరిస్తున్న సభ్యులకు ఆర్యవైశ్య సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.రైల్వే కోడూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, శాంతితో జీవించాలని ఆకాంక్షించారు. జై వాసవి.. జై జయ వాసవి అంటూ భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

డిప్యూటీ సీఎం పవన్ ఆశయాల సాధనకు ఎమ్మెల్యే నానాజీతో పయనిస్తాను

- తూరంగి మాజీ సర్పంచ్ బలగం వెల్లడి



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 13:-డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనకు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)తో కలిసి పయనిస్తానని కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామ మాజీ సర్పంచ్ బలగం ప్రసన్న కుమార్ పేర్కొన్నారు. సోమవారం కాకినాడలో డిప్యూటీ సీఎం పవన్ సమక్షంలో జనసేన పార్టీలో చేరానని పవన్ తనను కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించడం పట్ల ప్రసన్నకుమార్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అందుకు దీనికి సంబంధించి వివరాలను మంగళవారం తూరంగిలోని తన స్వగృహంలో విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ తాను 2022లో జనసేనలోకి చేరాలని ఆహ్వానం అందిందని అప్పుడు ఉన్న ఎమ్మెల్యే కన్నబాబుతో ఉన్న సన్నిహితం వల్ల మారలేకపోయానన్నారు. ఎమ్మెల్యే నానాజీ నీవు పార్టీలోకి రావాలని చాలా మర్యాదపూర్వకంగా ఆహ్వానించడంతో తాను జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నానన్నారు ఇకనుండి పార్టీ అభివృద్ధి లక్ష్యంగా ఎమ్మెల్యే నానాజీ సహకారంతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు తాను ఎవరికి ఆయన చేసే మనస్తత్వం కాదని తన వల్ల ఎవరు నష్టపోకూడదు అంటూ బలగం వ్యాఖ్యానించారు. ఎటువంటి పదవి ఆశించకుండా జనసైనికుడిగా పనిచేసి కాకినాడ సిటీ, రూరల్ ప్రాంతాల్లో జనసేన ఓటింగ్ రెండింతలు చేసేలా కృషి చేస్తానని ప్రసన్నకుమార్ చెప్పారు. ఉప్పాడ గ్రామం సముద్ర కోతను నివారించేందుకు పవన్ శాశ్వత పనిని చేపట్టారని అలాగే గిరిజన గ్రామాల్లో ఎన్నో మౌలిక సదుపాయాలు కల్పనకు ఆయన కృషి మరువలేనిదని బలగం చెప్పారు.ఈ సమావేశంలో జగడం శ్రీహరి,ఆతం వీరభద్రరావు, మలిరెడ్డి ప్రశాంత్, కుంచె బంగారు బాబు, టి ఈశ్వర్, వేపాడ శ్రీను, ఎం ప్రసాద్, పూర్ణ, వీరబాబు, శ్రీను, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిపై దురుసుగా ప్రవర్తించిన ఎస్ఐ ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలి



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 13:-సీపీఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పై దురుసుగా ప్రవర్తించి, ఆయన బండి తాళాలు లాక్కుని అడ్డుకున్న ఎస్ఐ ప్రసాద్ ను తక్షణమే సస్పెండ్ చేయాలని సిపిఎం రైల్వే కోడూరు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ సిహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేసారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రాజకీయ పార్టీ జిల్లా కార్యదర్శి పట్ల పోలీసు అధికారి బాధ్యతారహితంగా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరమని, ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు విచారించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించిన వామపక్ష పార్టీలు, ఆదివారం కూడా నిరసన కొనసాగించాయి. ఆదివారం నిరసన ముగించుకుని నాయకులు తిరిగి బయలుదేరుతున్న సమయంలో నాగరాజు బండి వద్దకు వచ్చిన ఎస్ఐ ప్రసాద్, ఈ వారం జరిగిన ఘటనపై నోటీసు తీసుకోమని బలవంత పెట్టడం ఆయన బండి తాళాలు లాక్కుని ఆపి, అడ్డుకున్నారని తెలిపారు. శనివారం దిష్టిబొమ్మ దహనం చేసినందుకు కేసు నమోదు చేశామని, నోటీసులు తీసుకోవాలని ఎస్ఐ దురుసుగా మాట్లాడినట్లు తెలిపారు. నోటీసులు తీసుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, కార్యాలయానికి వచ్చి తీసుకుంటామని నాగరాజు చెప్పినా ఎస్ఐ వినిపించుకోలేదని తెలిపారు. నేను ఎస్ఐని నా మాట వినవా? ఇప్పుడే నోటీసులు తీసుకోవాలి లేకపోతే కదలనిచ్చేది లేదు అంటూ అధికార దర్పంతో మాట్లాడారని, చుట్టూ ఉన్న వామపక్ష నాయకులు, కార్యకర్తలు ఎంతగా నచ్చజెప్పినా పట్టించుకోకుండా వ్యవహరించారని విమర్శించారు. నోటీసులు ఇవ్వాలనుకుంటే చట్ట ప్రకారం వ్యవహరించాలి తప్ప, బండి తాళాలు లాక్కొని బెదిరిస్తూ వెళ్లకుండా అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. జాతీయ రాజకీయ పార్టీ జిల్లా కార్యదర్శి అని తెలిసినా కనీస గౌరవం ఇవ్వకుండా, ఆయన చెప్పేది వినకుండా దురుసుగా ప్రవర్తించడం సరికాదని తెలిపారు. పోలీసులకు చట్టాన్ని అమలు చేసే బాధ్యత ఉందే తప్ప, అధికారాన్ని అడ్డుపెట్టుకుని నాయకులను అవమానించే హక్కు లేదని అన్నారు.

కడపలో 50 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

- రూ.28.58 లక్షల ఆర్థిక సాయం అందజేత: కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి



కడప మన జనప్రగతి అక్టోబర్ 13:-అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం సీఎం సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సాయం అందిస్తోంది. ఇందులో భాగంగా కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.28,58,365 విలువైన 50 చెక్కులను ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు.నియోజకవర్గంలో వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి జాప్యం లేకుండా సీఎం సహాయనిధి చెక్కులు అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నామని తెలిపారు. పేద ప్రజల కష్టసుఖాల్లో అండగా ఉంటూ, కడప నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కూటమి ముఖ్య కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో వైసీపీకి ఓటమి భయం పట్టుకుంది

- గతంలో ప్రత్యర్థుల నామినేషన్లను అడ్డుకున్న విషయాన్ని మరిచిపోయారా?



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 13:-గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులను ఇబ్బందులకు గురిచేశారని జనసేన రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ విమర్శించారు. మంగళవారం సిద్ధవటంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ఏకగ్రీవాల పేరుతో ప్రత్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకున్న ఘటనలు వైసీపీ నేతలకు గుర్తులేవా అని ప్రశ్నించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రత్యర్థులపై దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయాన్ని చవిచూసిన వైసీపీకి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఓటమి భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. గతంలో వైసీపీ చేసిన అరాచకాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయాన్ని సాధిస్తారని అతికారి కృష్ణ ధీమా వ్యక్తం చేశారు.

అగ్రిగోల్డ్ బాధితులు 13, 14 తేదీల్లో బాండ్లు సమర్పించాలి:ఎస్పి సుస్మిత

- అసలు బాండ్లు,ధ్రువపత్రాలు తప్పనిసరి



వీరబల్లి మన జనప్రగతి అక్టోబర్ 13:-అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల స్వీకరణలో భాగంగా ఈ నెల 13, 14 తేదీల్లో వీరబల్లి మండలానికి చెందిన బాధితుల నుంచి బాండ్లు స్వీకరించనున్నట్లు ఎస్పి సుస్మిత తెలిపారు. కడప జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాధితులు కడప జిల్లా ఎస్పీ కార్యాలయం ఎదుట ఉన్న ఆర్ఎస్ఐ కార్యాలయానికి అసలు అగ్రిగోల్డ్ బాండ్లు, అవసరమైన ధ్రువపత్రాలతో హాజరై నమోదు చేయించుకోవాలని సూచించారు. ఇబ్బందులు కలగకుండా అవసరమైన పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని కోరారు.బాధితులు అసలు అగ్రిగోల్డ్ బాండుతో పాటు స్వీయ ధ్రువీకరణ చేసిన జిరాక్స్ ప్రతులను సమర్పించాలి. పరిశీలన అనంతరం అసలు బాండును తిరిగి అందజేస్తారు. అలాగే బ్యాంకు ఖాతా పుస్తకంలోని మొదటి పేజీ నకలు, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు లేదా రేషన్ కార్డులో ఏదైనా ఒకటి, పాన్ కార్డు నకలు, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలని తెలిపారు.బాండుదారుని తరఫున నామినీ లేదా బంధువులు బాండ్లు సమర్పిస్తే సంబంధిత గుర్తింపు పత్రాలు, అవసరమైన అధికార పత్రాలు, బంధుత్వ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. బాండుదారుడు మరణించినట్లయితే మరణ ధ్రువపత్రం సమర్పించాలన్నారు. బాండుదారుడు, నామినీ ఇద్దరూ మరణించిన సందర్భాల్లో వారసత్వ ధ్రువపత్రాలు, ఇతర వారసుల వివరాలు, అవసరమైన అనుమతి పత్రాలు సమర్పించాలని వివరించారు.బాండుపై ఉన్న సంఖ్య, బాండుదారుని పేరు, నామినీ పేరు, మొత్తం, తేదీ తదితర వివరాలను రికార్డులతో పరిశీలిస్తామని ఎస్పి తెలిపారు. బాండులో మార్పులు, దిద్దుబాట్లు లేదా అనుమానాస్పద అంశాలు ఉన్నా, గతంలో అదే బాండుపై దరఖాస్తు చేసినా అధికారులకు తెలియజేయాలని సూచించారు.వీరబల్లి మండలానికి చెందిన అగ్రిగోల్డ్ బాధితులు కేటాయించిన తేదీల్లో అవసరమైన పత్రాలతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పి సుస్మిత కోరారు.

జిల్లేడుబండ రిజర్వాయర్ సమస్యపై సీఎంతో మంత్రి సత్యకుమార్ చర్చలు

- బాధిత రైతులకు పరిహారం అందించాలి... ప్రాజెక్టుపై స్పష్టత ఇవ్వాలి



అమరావతి, మన జనప్రగతి, అక్టోబర్ 13:- శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గంలోని ముదిగుబ్బ మండలం జిల్లేడుబండ రిజర్వాయర్ సమస్యను పరిష్కరించి, బాధిత రైతులకు న్యాయం చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రితో సమావేశమై ప్రాజెక్టు కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతోనూ చర్చించారు.గతంలో గ్రామసభలు నిర్వహించకుండా భూసేకరణ, ప్రాజెక్టు పనులు చేపట్టడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సత్యకుమార్ యాదవ్ వివరించారు. పనులు మధ్యలో నిలిచిపోవడంతో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించే అంశాలపై దృష్టి సారించాలని కోరారు.రిజర్వాయర్‌ను కొనసాగించాలా, అవసరమైన మార్పులతో ముందుకు తీసుకెళ్లాలా అనే అంశంపై సమగ్ర అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు పూర్తయితే సుమారు 23 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నందున, రైతుల ప్రయోజనాలు, ప్రాంతీయ నీటి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు.రిజర్వాయర్ సామర్థ్యం, భూముల ముంపు ప్రభావం, పరిహారం తదితర అంశాలను పరిశీలించేందుకు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయి అధ్యయనం చేపట్టి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని చర్చించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో మిధునకు మూడో స్థానం



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 13:-ఆంధ్రప్రదేశ్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 10, 11 తేదీల్లో నెల్లూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో కే. మిధున ప్రతిభ కనబరిచి మూడో స్థానం సాధించింది. అండర్-14 బాలికల విభాగంలో జరిగిన ఈ పోటీల్లో సుమారు వందమంది పాల్గొనగా, మిధున మూడో స్థానంలో నిలిచి జార్ఖండ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించింది.ఈ సందర్భంగా మిధునను డీఎస్‌డీఓ సతీష్‌కుమార్, యోగా కోచ్ ఇందిర అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

శిల్పారామంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

● బతుకమ్మ వేడుకలు, కథక్, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో సందడి



శేరిలింగంపల్లి మన జనప్రగతి అక్టోబర్ 13:-మాదాపూర్ శిల్పారామంలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మలను పేర్చి, సాయంత్రం సందర్శకులతో కలిసి బతుకమ్మ ఆటలు ఆడారు. అనంతరం నిర్వహించిన కథక్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో అలరించాయి.అర్చన మిశ్రా శిష్య బృందం కథక్ నృత్య ప్రదర్శనలో భాగంగా గణేష్ వందన, గురు వందన, జగత్ జనని, దుర్గ స్తుతి, కాళీ ద్రుపద్, చతురంగ తదితర అంశాలను ప్రదర్శించారు. మోనిశిత, వంశీకృష్ణ, అనూష, రితిక, ఇషని, ఆకాంక్ష, పాయల్, నిత్య, దృశ్య, వీరా జైన్ తదితర కళాకారులు తమ నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.అనంతరం ప్రవల్లిక శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది. పూర్వరంగం, అంబే జగదాంబ, సూర్యాష్టకం, అమ్మ నీరాజనం, మామవతు సరస్వతి, తరంగం, జతిస్వరం తదితర అంశాలను నక్షత్ర, సహస్ర, హంసిని, యుక్త, ఆరాధ్య, అవర్ణిక, ధరణి, చిన్మయి తదితర కళాకారులు ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.బతుకమ్మ వేడుకలతో పాటు సంప్రదాయ నృత్య ప్రదర్శనలు శిల్పారామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. సందర్శకులు కార్యక్రమాలను ఆస్వాదించారు.

ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా సమగ్ర వ్యవసాయ ప్రణాళిక

- పంటల వైవిధ్యంతో వర్షాభావాన్ని ఎదుర్కోవాలి: కలెక్టర్ నిశాంత్ కుమార్



మదనపల్లె, అక్టోబర్ 13 (మన జనప్రగతి): ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు బెట్టను తట్టుకునే పంటలు సాగు చేయాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. మంగళవారం మదనపల్లె కలెక్టరేట్‌లో వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. రైతుల ఆదాయానికి భరోసా కల్పించేలా సెప్టెంబర్ 2026 నుంచి జూన్ 2027 వరకు అమలు చేయనున్న సమగ్ర వ్యవసాయ ప్రణాళికపై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలో సాధారణ ఖరీఫ్ సాగు విస్తీర్ణం 46,055 హెక్టార్లు కాగా, సెప్టెంబర్ 15 నాటికి 32,751 హెక్టార్లలో సాగు జరిగినట్లు తెలిపారు. మిగిలిన భూముల్లో వర్షపాతాన్ని బట్టి సజ్జ, కొర్ర, నువ్వులు, ఉలవలు, అలసందలు, కుసుమ వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. వేరుశనగ, కంది, వరి, కూరగాయలతో పాటు మామిడి తోటల్లో అంతర పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. చీడపీడల నివారణ, పశుగ్రాస పంటలు, విత్తన గుళికల వినియోగం, పెరటి తోటల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తూ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల వైవిధ్యాన్ని పెంచాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు హరిప్రియ, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకట మోహన్, సహాయ వ్యవసాయ సంచాలకులు నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కువైట్‌లో చిక్కుకున్న మహిళ స్వగ్రామానికి చేరిక

- మంత్రి కందుల దుర్గేష్ చొరవతో స్వదేశానికి రప్పింపు



నిడదవోలు, మన జనప్రగతి, అక్టోబర్ 13:- భర్త మరణవార్త తెలుసుకుని కువైట్‌లో చిక్కుకుపోయిన నిడదవోలు నియోజకవర్గం మునిపల్లె గ్రామానికి చెందిన చింతల నాగలక్ష్మిని మంత్రి కందుల దుర్గేష్ చొరవతో స్వగ్రామానికి రప్పించారు. దీంతో ఆమె భర్త చింతల వెంకటేష్‌కు చివరిచూపు చూసుకునే అవకాశం లభించింది.వెంకటేష్ సోమవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న నాగలక్ష్మి స్వగ్రామానికి రావాలని ప్రయత్నించినప్పటికీ, ఆర్థిక ఇబ్బందులు, యాజమాన్యం నుంచి ఎదురైన ఆటంకాలతో ఇబ్బందులు పడ్డారు. తన పరిస్థితిని వీడియో సందేశం ద్వారా మంత్రి దుర్గేష్‌కు తెలియజేసి సాయం కోరారు.దీంతో మంత్రి వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, తన కార్యాలయ అదనపు పీఎస్ కేఎస్‌వీ రమణరావు, స్థానిక జనసేన నాయకులు, ఏపీఎన్ఆర్‌టీ ప్రతినిధి నాగరాజుతో సమన్వయం చేశారు. నాగలక్ష్మితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పడంతో పాటు, ఆమె ప్రయాణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంత్రి చొరవతో ఆమె ఎలాంటి ఖర్చు లేకుండా స్వగ్రామానికి చేరుకున్నారు.భర్తకు తుది వీడ్కోలు పలికేందుకు అవకాశం కల్పించిన మంత్రి దుర్గేష్‌కు నాగలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సహకరించిన అదనపు పీఎస్ రమణరావును మంత్రి అభినందించారు.

రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడిగా కానగల సుబ్బరామయ్య నియామకం



కడప మన జనప్రగతి అక్టోబర్ 14:-రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా కడప జిల్లా అధ్యక్షుడిగా కానగల సుబ్బరామయ్య నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విప్పర్ల మత్తయ్య ఆధ్వర్యంలో ఈ నియామకం చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం కడప ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సుబ్బరామయ్య మాట్లాడారు.పార్టీ పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా జాతీయ అధ్యక్షుడు రామదాస్ అత్వాలే, రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని బడుగు, బలహీన, పీడిత వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధన కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కడప మేయర్ పదవికి పోటీ చేయనున్నట్లు సుబ్బరామయ్య ప్రకటించారు. జిల్లాలోని అన్ని స్థానాల్లో తమ పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపనున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు, వివిధ సంఘాల నాయకులు తమ పార్టీకి మద్దతు ఇచ్చి సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో వంక దారు శ్రీనివాసరావు, జావాజ్ పనీంద్రకుమార్, సంగటి మనోహర్, జీవీ రమణ, ఓబులేసు, నరసయ్యలు పాల్గొన్నారు.

గాలివీడులో నూతన మార్కెట్ యార్డ్‌కు భూమిపూజ

- రూ.70 లక్షలతో 166 షెడ్ల నిర్మాణం





గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 13:-గాలివీడు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో నూతన మార్కెట్ యార్డ్ నిర్మాణానికి మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి భూమిపూజ చేశారు. పంచాయతీరాజ్ నిధుల నుంచి రూ.70 లక్షలు కేటాయించి మార్కెట్ యార్డ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.ఈ నిధులతో 10ఐ10 అడుగుల విస్తీర్ణంలో 166 షెడ్లను నిర్మించడంతో పాటు సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ మార్కెట్ యార్డ్ నిర్మాణం పూర్తయితే రైతులు, కూరగాయల వ్యాపారులకు సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.ఈ సందర్భంగా లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం సంతలో సరైన వసతులు లేక రైతులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎండాకాలంలో కూరగాయలు వాడిపోవడం, వర్షాకాలంలో తడిసిపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మార్కెట్ యార్డ్ నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు.రైతులు, వ్యాపారులు తమ ఉత్పత్తులను సౌకర్యవంతంగా విక్రయించుకునేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. మార్కెట్ యార్డ్ నిర్మాణంతో గాలివీడు సంత రూపురేఖలు మారడంతో పాటు రైతులు, వ్యాపారులు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, మండిపల్లి అభిమానులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమీర్ బాబు జన్మదినం సందర్భంగా అనాథాశ్రమంలో అన్నదానం



కడప మన జనప్రగతి అక్టోబర్ 13:-తెలుగుదేశం పార్టీ కడప నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి వి.ఎస్. అమీర్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం కడప నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.ఇందులో భాగంగా జిల్లా పరిషత్ సమీపంలోని ప్రేమాలయ అనాథాశ్రమంలో సి.ఎస్. నాసరాలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమీర్ బాబు జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహిస్తూ నిరుపేదలు, అనాథలకు అండగా నిలవాలనే సందేశాన్ని చాటారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని అన్నదాన కార్యక్రమానికి సహకరించారు.

ధర్మవరం అభివృద్ధికి రూ.2 కోట్లకు పైగా సీఎస్ఆర్ నిధులు

● పారిశుద్ధ్యం, వైద్యం, పోలీసు శాఖ, దివ్యాంగుల సంక్షేమానికి సహకారం



ధర్మవరం, మన జనప్రగతి, అక్టోబర్ 13: ధర్మవరం నియోజకవర్గంలో ప్రజా సదుపాయాల అభివృద్ధికి వివిధ కార్పొరేట్ సంస్థల నుంచి రూ.2.025 కోట్ల విలువైన నిధులు, పరికరాల సహకారం అందనుంది. మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ చొరవతో పారిశుద్ధ్యం, పోలీసు శాఖ, దివ్యాంగుల సంక్షేమం, ప్రభుత్వ వైద్య సేవల బలోపేతానికి ఈ సహకారాన్ని వినియోగించనున్నారు. ఎస్ఈఐఎల్ సంస్థ మున్సిపాలిటీకి 16 విద్యుత్ చెత్త సేకరణ వాహనాలు, రెండు నీటి ట్యాంకర్లను అందించనుంది. పోలీసు శాఖకు ఐదు బొలెరో వాహనాలు, ఒక డ్రోన్ సమకూర్చారు. ఈగిల్ కోట్స్ సంస్థ మున్సిపల్ భవనాల మరమ్మతులు, నిర్వహణకు రంగులు సరఫరా చేసింది. దివ్యాంగుల రవాణా సౌకర్యం కోసం హెచ్పీసీఎల్ సంస్థ రూ.49 లక్షల విలువైన పది హ్యాండ్ కంట్రోల్ ఆటోరిక్షాలు, పది స్కూటీలను అందించనుంది. గ్లాండ్ ఫార్మా సంస్థ రూ.1.50 లక్షల విలువైన రెండు శిశు ఉష్ణ సంరక్షణ పరికరాలను సమకూర్చనుంది. డాక్టర్ రెడ్డీస్ సంస్థ సహకారంతో నియోజకవర్గంలోని తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధునికీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వైద్య పరికరాలు, రోగ నిర్ధారణ, టీకాల సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వ నిధులకు అదనంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను సమీకరించి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంపై దృష్టి సారించినట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈ సహకారంతో నియోజకవర్గంలో పారిశుద్ధ్యం, రవాణా, పోలీసు, వైద్య సేవలకు మరింత తోడ్పాటు లభించనుంది.

సెలవుల్లో తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- డీఈఓ శంషుద్దీన్‌కు విద్యార్థి సంఘాల వినతి



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 13:- దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కడప, బద్వేల్, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రాజంపేట, పులివెందుల ప్రాంతాల్లోని కొన్ని పాఠశాలలు సెలవుల్లో తరగతులు నిర్వహించడంతో పాటు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తున్నాయని నాయకులు ఆరోపించారు. సెలవుల్లోనూ తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులపై చదువుల ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు జిల్లావ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న, ఏఐఎస్‌బీ జాతీయ అధ్యక్షుడు జయవర్ధన్, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి సుబ్బారాయుడు, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్, ఏఎస్‌వైఎఫ్ జాతీయ అధ్యక్షుడు ఓబయ్య పాల్గొన్నారు.


తిరుపతిలో జరిగే ఆశా వర్కర్ల ప్రాంతీయ
సదస్సును జయప్రదం చేయాలి



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 13:- చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల ఆశా వర్కర్ల ప్రాంతీయ సదస్సును ఈనెల 25వ తేదీన తిరుపతిలో నిర్వహిస్తున్నట్లు ఆ సందర్భంగా ముద్రించిన కరపత్రాలను రైల్వే కోడూరు నియోజకవర్గం లోని ఎనిమిది పిహెచ్‌సి లలో మంగళవారం విడుదల చేసినట్లు రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు కుమారి, రత్నమ్మ తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లతో అనేక రకాల పనులు చేయించుకుంటూ వారి శ్రమకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. ఆశా వర్కర్లను వైద్య ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించే విధంగా ఉద్యోగ భద్రత, సంక్షేమ సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు అవసరమైన సెల్‌ఫోన్లు, రికార్డుల నిర్వహణకు సంబంధించిన సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందించాలని కోరారు. ఆశా వర్కర్లపై పని భారాన్ని తగ్గించి, వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటియుసి ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఎప్పటికీ ఆశాలకు అండగా సమస్యల పరిష్కారంలో అందరినీ కలుపుకొని పోరాటాల ద్వారా అనేక విజయాలను సాధించిందని అన్నారు. చాలా డిమాండ్లు పెండింగ్లో ఉన్నాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక హామీలు ఇచ్చారని ఆ హామీల అమలు కోసం పోరాటాల రూపకల్పనకు రాష్ట్రవ్యాప్తంగా ప్రాంతీయ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రాంతీయ సదస్సులో ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజకవర్గ కోశాధికారి మురళి, ఆఫీస్ బేరర్స్ దినేష్, నాయకులు ఆశ వర్కర్లకు మద్దతుగా పాల్గొన్నారు

ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

● తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ



తిరుపతి, మన జనప్రగతి అక్టోబర్ 13:- మున్సిపల్ సాధారణ ఎన్నికల విధులను అధికారులు, సిబ్బంది నిబద్ధతతో, నిష్పక్షపాతంగా నిర్వహించాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక కచ్చపి ఆడిటోరియంలో ఎన్నికల విధులు నిర్వహించనున్న రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్ఓలు), సహాయక సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సందేహాలుంటే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, ప్రిసైడింగ్ అధికారి డైరీ, హ్యాండ్‌బుక్‌ను తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎన్నికల నిర్వహణను విజయవంతం చేయాలని కోరారు. శిక్షణ అనంతరం ఎన్నికల సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదాదేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు, భరత్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుపతి మేయర్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ఏర్పాట్ల పరిశీలన



తిరుపతి, మన జనప్రగతి, అక్టోబర్ 13:- తిరుపతి నగరపాలక సంస్థ స్థానిక ఎన్నికలు2026లో భాగంగా ఓట్ల లెక్కింపు నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మంగళవారం పరిశీలించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లు, వార్డు సభ్యులు, మేయర్ ఓట్ల లెక్కింపు హాళ్లు, మీడియా గది, కంట్రోల్ రూమ్, అభ్యర్థులు, ఏజెంట్ల నిరీక్షణ గదుల ఏర్పాట్లను సమీక్షించారు. కౌంటింగ్ కోసం గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి, రెండో అంతస్తుల్లో గదుల కేటాయింపు ప్రతిపాదనలను పరిశీలించారు. మేయర్ ఓట్ల లెక్కింపునకు మొదటి అంతస్తులోని సెంట్రల్ హాల్‌ను ప్రతిపాదించగా, వార్డులవారీగా స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుపై చర్చించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆమోదానికి అనుగుణంగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, శ్రీలత, ఎలక్షన్ డిప్యూటీ కలెక్టర్ భరత్ నాయక్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, అర్బన్ తహసీల్దార్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మాదిగల భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వంగిపురం రెడ్డన్న డిమాండ్



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 13:- ప్రభుత్వం మాదిగలకు మంజూరు చేసిన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వంగిపురం రెడ్డన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు లక్కిరెడ్డిపల్లి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డన్న మాట్లాడుతూ, లక్కిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని అప్పకొండయ్యగారిపల్లి వద్ద సర్వే నంబర్ 440/3లో ఉన్న 5.05 ఎకరాల భూమిని ప్రభుత్వం 1982లో వెట్టి చాకిరీ విముక్తి కార్యక్రమంలో భాగంగా ఉత్తరమేటి హరిజనవాడకు చెందిన గంగన్నకు మంజూరు చేసిందని తెలిపారు. అప్పటి నుంచి ఆయన కుటుంబ సభ్యులు భూమిని సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల వర్షాలు లేక భూమిని సాగు చేయని పరిస్థితిని ఆసరాగా చేసుకుని, కొందరు వ్యక్తులు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గడ్డివాములు, శ్మశానవాటికకు స్థలం కావాలంటూ దళితులపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన భూమిని అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి, హక్కుదారులకు న్యాయం చేయాలని కోరారు. దళితులకు రక్షణ కల్పించి, భూమి ఆక్రమణకు ప్రయత్నిస్తున్న వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రెడ్డన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్కిరెడ్డిపల్లి ఓబులేసు, న్యాయ సలహాదారులు రాజ్‌కుమార్, రామ్మోహన్, నాగశేషు, సీవీ రమణయ్య, మంద వాసు, వై. రమణ, పీరయ్య, ప్రేమకుమార్, అంజి, వరప్రసాద్ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల కంపెనీ దుకాణంలో ఢిల్లీ అధికారి ఆకస్మిక తనిఖీ



గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 13:- అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఎగువగొట్టివీడులో రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల కంపెనీ రిటైల్ దుకాణాన్ని ఢిల్లీ అధికారి అరవింద్ కుమార్ సింగ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, డ్రిప్ పరికరాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరసమైన ధరలకు అందిస్తున్న తీరును పరిశీలించారు. భారత ప్రభుత్వ సహకారంతో మామిడి రైతులకు ఆర్గానిక్ ఎరువులు, వ్యవసాయ యంత్ర పరికరాలు, పశువుల దాణా కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ వెంకటరమణ, సిబ్బంది అరవింద్ కుమార్ సింగ్‌ను శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఓడీ సభ్యులు చిన్నరెడ్డప్ప నాయుడు, మల్లికార్జున నాయుడు, సీఈఓ ప్రసాద్, అకౌంటెంట్ హేమకుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మ

- జగన్ ఆదేశాల మేరకు అభ్యర్థిత్వ ప్రకటన




పులివెందుల, మన జనప్రగతి అక్టోబర్ 13:- పులివెందుల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పదవికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వైఎస్ మనోహర్ రెడ్డి సతీమణి వైఎస్ ప్రమీలమ్మ పోటీ చేయనున్నట్లు వైఎస్ మనోహర్ రెడ్డి, వైఎస్ మధుసూదన్ రెడ్డి ప్రకటించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆమె అభ్యర్థిత్వాన్ని ప్రకటించినట్లు నాయకులు తెలిపారు. వైఎస్ ప్రమీలమ్మ గతంలో ఒక పర్యాయం పులివెందుల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేశారు. ఆ సమయంలో మున్సిపాలిటీ పరిపాలనలో పనిచేసిన అనుభవం ఆమెకు ఉందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ అనుభవంతో పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిపారు. పులివెందుల పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని నాయకులు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, పట్టణ అభివృద్ధికి సంబంధించిన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున చైర్‌పర్సన్ అభ్యర్థిగా వైఎస్ ప్రమీలమ్మ పేరు ప్రకటించడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం రెట్టింపు అయింది

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు



ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 13:- రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు మంగళవారం ఓబులవారిపల్లి మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఎంపీడీవో కార్యాలయంలో, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండల ప్రజలు అధికారులకు సహకరిస్తూ, ఎన్నికల సమయంలో అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిద్ధేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో కృష్ణ, ఓబులవారిపల్లి ఎస్సై సుజన్ కుమార్, ఆరే మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో అంబాభవానీ దేవిగా వాసవిమాత భక్తులకు దర్శనం



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 13:- స్థానిక అమ్మవారి శాలలో వెలసిన కన్యకామాత మంగళవారం అంబా భవానీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద మంత్రోచ్చారణతో వాసవి మాతకు పంచామృతాభిషేకం,నివేదన,మంత్రపుష్పం, మహామంగళ హారతి, తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తి వాసవి మాత సాయంత్రం అంబాభవాని దేవి,రాత్రి అన్నపూర్ణాదేవి దేవిగా భక్తులను కటాక్షించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. వాసవి కళ్యాణ మండప ఆవరణలో ఏర్పాటు చేసిన రేలా రే రేలా కార్యక్రమంలో జానపద నృత్యాలు ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ ,ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు , ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ శ్రీ వాసవి కళ్యాణ మండపం, అవోపా,మండల ఆర్యవైశ్య సంఘం,అవోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గుంటూరు మేయర్ అభ్యర్థిగా నర్రా సునీత



గుంటూరు, మన జనప్రగతి, అక్టోబర్ 13:- గుంటూరు నగర మేయర్ పదవికి గ్రామీణ వైద్యుల జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి నర్రా సునీత పోటీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలని పార్టీ నిర్ణయించినట్లు పేర్కొన్నాయి.గత రెండు దశాబ్దాలుగా ప్రజాసేవలో ఉన్న సునీత, కరోనా సమయంలోనూ వైద్య సహాయకురాలిగా సేవలందించారని పార్టీ ప్రతినిధులు తెలిపారు. మహిళల భద్రత, ఉపాధి, రైతులు, పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. గుంటూరులోని అన్ని డివిజన్ల నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.పార్టీ పోస్టర్‌ను సినీ నటుడు ఎన్.ఎస్. నాయుడు విడుదల చేయగా, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండిశెట్టి సురేష్ బాబు కార్యక్రమాన్ని నిర్వహించారు.

టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- ముక్కా వరలక్ష్మి పిలుపు



ఓబులవారిపల్లి మన జనప్రగతి అక్టోబర్ 13:రైల్వే కోడూరు నియోజకవర్గంలో ప్రతి టీడీపీ కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టీడీపీ ఇన్‌చార్జి ముఖా రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి పిలుపునిచ్చారు.మంగళవారం ఆమె పెనగలూరు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీలో చేరారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కొత్తగా చేరిన వారికి ముక్కా వరలక్ష్మి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వాసుదేవరెడ్డి, పెనగలూరు మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహాద్రిపురం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సింహాద్రిపురం, అక్టోబర్ 13 (మన జనప్రగతి): సింహాద్రిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 197374 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయులు వీరనారాయణ రెడ్డి, మురారెడ్డిని ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి రూ.30 వేల విరాళం అందించిన వీరనారాయణ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

ప్రజల ఆరోగ్య పరిరక్షణ మనందరి బాధ్యత

● ఆరోగ్య సిబ్బందికి డాక్టర్ గవాస్కర్ రెడ్డి సూచనలు



తొండూరు మన జనప్రగతి అక్టోబర్ 13:-మండల పరిధిలోని తొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గవాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆశా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇంటింటి సర్వేల ద్వారా తల్లులు, శిశువులకు అవసరమైన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. మాతా శిశు మరణాల తగ్గింపునకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.అక్టోబర్ నెల చివరి వరకు నిర్వహించే కుష్ఠు వ్యాధి కేసుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా 100 శాతం సర్వే పూర్తి చేయాలని తెలిపారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు సురక్షిత తాగునీటిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు.14 సంవత్సరాల వయస్సు గల అర్హులైన బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు అందించే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను వేయించాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రమాదకర గర్భిణులు, రక్తహీనతతో బాధపడుతున్న తల్లులు, పిల్లలకు ప్రాధాన్యతనిస్తూ వైద్య సేవలు అందించాలన్నారు.మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులను తొలిదశలోనే గుర్తించి, బాధితులకు సకాలంలో చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని డాక్టర్ గవాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయ, మల్లయ్య, షీబా రాణి, ఆశా నోడల్ అధికారి, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీకి షాక్..టీడీపీలోకి 45 ముదిరాజు కుటుంబాలు



చిట్వేలి మన జనప్రగతి అక్టోబర్ 13:-స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ పెనగలూరు మండలం కొండూరు పంచాయతీ పరిధిలోని తిరణం పల్లి గ్రామంలో వైసీపీకి ఎదురు దెబ్బ తగిలింది. గ్రామానికి చెందిన ముదిరాజు సామాజిక వర్గానికి చెందిన 45 కుటుంబాలు టీడీపీలో చేరాయి. మద్దెల ప్రసాద్ గారి ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి టీడీపీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీపై నమ్మకంతో పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యత ఉంటాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు జరగడం గ్రామంలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. 45 కుటుంబాలు టీడీపీలో చేరడంతో గ్రామంలో పార్టీకి మరింత బలం చేకూరిందని స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ, గ్రామాభివృద్ధి లక్ష్యంగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

రూ.3.50 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన

- 45 రోజుల్లో నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం:ఎమ్మెల్యే మాధవి



కడప మన జనప్రగతి అక్టోబర్ 13:-కడప నగరంలో విద్యుత్ కోతలను నివారించేందుకు సూర్య హాస్పిటల్ పక్కన రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి మంగళ వారం ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరంలో గత 40 ఏళ్లుగా విద్యుత్ కోతల సమస్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గత పాలకులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. రాష్ట్రానికి మంజూరైన రెండు విద్యుత్ ఉపకేంద్రాల్లో ఒకటి దర్గి నియోజకవర్గానికి, మరొకటి కడప నియోజకవర్గానికి కేటాయించినట్లు తెలిపారు. ఈ విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణాన్ని 45 రోజుల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.మాజీ కార్పొరేటర్లు బాలకృష్ణ రెడ్డి, సూర్యనారాయణ, శివ కోటిరెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు మన్సూర్ అలీఖాన్, రెడ్డయ్య యాదవ్, మనోజ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ చిట్టిపోయిన సుబ్బరాయుడు యాదవ్, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో అంబాభవానీ దేవిగా వాసవిమాత భక్తులకు దర్శనం



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 13:-స్థానిక అమ్మవారి శాలలో వెలసిన కన్యకామాత మంగళవారం అంబా భవానీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద మంత్రోచ్చారణతో వాసవి మాతకు పంచామృతాభిషేకం,నివేదన,మంత్రపుష్పం, మహామంగళ హారతి, తదితర విశేష పూజలు నిర్వహించారు.అనంతరం ఉత్సవ మూర్తి వాసవి మాత సాయంత్రం అంబాభవాని దేవి,రాత్రి అన్నపూర్ణాదేవి దేవిగా భక్తులను కటాక్షించారు.తీర్థ ప్రసాదాలు అందజేశారు. వాసవి కళ్యాణ మండప ఆవరణలో ఏర్పాటు చేసిన రేలా రే రేలా కార్యక్రమంలో జానపద నృత్యాలు ఎంతగానో ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ ,ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు , ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ శ్రీ వాసవి కళ్యాణ మండపం, అపోపా,మండల ఆర్యవైశ్య సంఘం,అపోపా మహిళా విభాగ్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

తుల్జా భవానీ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, మెట్టు కుమార్ యాదవ్

● అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

● పటాన్ చెరువు ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక పూజలు



పటాన్ చెరువు మన జనప్రగతి అక్టోబర్ 13:- మహారాష్ట్రలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన తుల్జాపూర్ శ్రీ తుల్జా భవానీ మాత ఆలయాన్ని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ తమ బృందంతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని ప్రార్థించి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తి వాతావరణం నెలకొంది. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, పటాన్చెరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని నాయకులు ఆకాంక్షించారు.అనంతరం మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి తుల్జాపూర్ భవానీ మాతను దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి, ప్రతి కుటుంబంలో సంతోషం వెల్లివిరియాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రావాలని, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.తుల్జా భవానీ మాత దర్శనం ఆధ్యాత్మిక ప్రశాంతతను, నూతన ఉత్సాహాన్ని అందించిందని నాయకులు పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, పటాన్చెరు నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో నాయకుల బృందం, ఇతర భక్తులు పాల్గొన్నారు.

చంద్రఘంటాదేవిగా దుర్గమ్మతల్లి భక్తులకు దర్శనం



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 13:-స్థానిక సాయి నగర్ లోని ఆలయంలో వెలసిన దుర్గమ్మ తల్లి మంగళవారం శ్రీ చంద్రఘంటాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అర్చకుడు శాఖలో విష్ణు శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి కి అభిషేకాలు ఇతర పూజాధి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని శ్రీ చంద్రఘంటాదేవి అలంకారంలో తీర్చిదిద్దారు. వేంపల్లి, కత్తులూరు మాజీ సర్పంచులు కొత్తూరు రెడ్డయ్య, ఆర్ ఎల్ వి ప్రసాద్ రెడ్డి, చింతల మడుగుపల్లె పిఏసిఎస్ మాజీ ఉపాధ్యక్షుడు ఎమ్.శ్రీనివాసులురెడ్డి, అమ్మగారి పల్లె వి. రాజగోపాల్ రెడ్డి లు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉభయదారులను ఆలయ వ్యవస్థాపకుడు జడ్పిటిసి మాజీ సభ్యుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి ఆలయ మర్యాదలతో శాలువలతో ఘనంగా సత్కరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శిల్పారామంలో మూడు రోజుల పాటు దసరా సంబరాలు

- ఈ నెల 18 నుంచి 20 వరకు సాంస్కృతిక కార్యక్రమాలు

పులివెందుల,టౌన్ మన జనప్రగతి, అక్టోబర్ 13:- పులివెందుల శిల్పారామంలో దసరా సంబరాలు2026 సందర్భంగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు శిల్పారామం పరిపాలనా అధికారి సుధాకర్ తెలిపారు. కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం సుధాకర్ తన సిబ్బందితో కలిసి విడుదల చేశారు. శిల్పారామం చైర్‌పర్సన్ మంజుల రెడ్డి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి. స్వామి నాయుడు సహకారంతో వేడుకలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.18న శ్రీ రాజ కళానిలయం చిన్నారులచే జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయి. 19న టీ. యువ కిషోర్ యువరాజ్ డాన్సింగ్ స్కూల్ చిన్నారుల కోలాట ప్రదర్శన నిర్వహించనున్నారు. 20న శ్రావణ్ కుమార్ ఎస్‌కే ఫిలిం డాన్స్ అకాడమీ, సత్యసాయి కోలాట బృందం, ధర్మవరం ఎన్టీఆర్ డాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శనలు ఇవ్వనున్నారు.పులివెందుల పట్టణ ప్రజలు ఈ మూడు రోజుల సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరై చిన్నారులను ప్రోత్సహించాలని సుధాకర్ కోరారు.

గొప్ప మహిమగల క్షేత్రం పులివెందుల శ్రీ రంగనాథ ఆలయం

- కేరళ ప్రముఖ సిద్ధాశీతి, దైవజ్ఞులు డిఎస్ మహేంద్ర కుమార్



పులివెందుల మన జనప్రగతి అక్టోబర్ 13:- పులివెందులలోనీ శ్రీ రంగనాథ క్షేత్రము పురాణం ప్రసిద్ధి చెందినదని, ఎంతో మహిమాన్వితమైనదని, తమిళనాడులోని శ్రీరంగం, కర్ణాటకలోని శ్రీరంగపట్నం వంటి క్షేత్రాల సరసన ఈ ఆలయం చేరుతుందని కేరళకు చెందిన ప్రముఖ సిద్ధాంతి, దైవజ్ఞులు డిఎస్ మహేంద్ర కుమార్ పేర్కొన్నారు. పులివెందులలో మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా మహేంద్ర కుమార్ మాట్లాడుతూ పులివెందులలో వెలసిన శ్రీ రంగనాథ స్వామి క్షేత్రంలో అష్ట మంగళ కార్యక్రమం, దైవ ప్రశ్న పూజా కార్యక్రమాల నిర్వహణకు కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురం నుంచి రావడం జరిగిందన్నారు. పులివెందులకు చెందిన ఎమ్మెల్సీ భూమీరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమాలకు తన బృందంతో కలిసి వచ్చామన్నారు. పులివెందులలో ఉన్నటువంటి శ్రీ రంగనాథ స్వామి క్షేత్రం వేల సంవత్సరాల నుంచి కొలువుతీరిందని తమ పూజా కార్యక్రమాల్లో కనుగొన్నామన్నారు. ఇక్కడ ఈ క్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం కూడా ఒకప్పుడు ఉండేదని ఆయన వెల్లడించారు . శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం శ్రీరంగ నాథ ఆలయంతో సమానంగా పూజలు అందుకునేదన్నారు. ఇక్కడ జరిగిన తవ్వకాలలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి విగ్రహం బయటపడిందని వెల్లడించారు. అంతేకాక ఈ ఆలయం చరిత్ర ఎంతో గొప్పదని విజయనగర సామ్రాజ్య కాలం నుండి ఇది ఎంతో వైభవంగా నడిచింది అన్నారు. అంతకు మునుపు కూడా ఎంతో మహిమాన్విత ఆలయంగా ప్రసిద్ధి చెందినదని అన్నారు. ముఖ్యంగా విజయనగర సామ్రాజ్యానికి చెందిన శ్రీకృష్ణదేవరాయల చక్రవర్తి హయాంలో ఈ ఆలయానికి ఎంతో అనుబంధం ఉండేది అన్నారు. ఈ ఆలయం ఇక్కడ కొలువు తీరడం వల్ల ఈ ప్రాంతం ఎంతో శక్తివంతమైనది అన్నారు. ఈ ఆలయం చాలా శక్తివంతమైనదని ఇక్కడ పూజలు నిర్వహిస్తున్న వారికి , కోరిన సంకల్పం మేరకు అనేక శుభాలు దొరుకుతాయని పేర్కొన్నారు .సైనిక పటాలశీ కూడా సమీపంలో ఉండేది అన్నారు. గతంలో ఈ ఆలయం ఎంతో ఉన్నతంగా భారతదేశంలోని తిరుచిలో గల శ్రీరంగం, కర్ణాటక రాష్ట్రంలోని శ్రీరంగ పట్టణం ఆలయాల వలె ఇది ఎంతో శక్తివంతమైనది, ఉజ్వలవంతంగా ప్రకాశించిందన్నారు. ఈ ఆలయం ఒక ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలిగిందన్నారు. ప్రస్తుతం పులివెందుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు ఇక్కడికి వచ్చి అష్ట మంగళ కార్యక్రమం, దైవ ప్రశ్న పూజా కార్యక్రమాలను నిర్వహించి అనేక విషయాలను తెలుసు పోవడం జరిగింది అన్నారు. ఈ ఆలయంలో భూత భవిష్యత్తు వర్తమానం కాలాలలో జరిగిన వివిధ ప్రముఖ సంఘటనలను రాసి చక్రం ద్వారా తెలుసుకున్నామన్నారు. ఈ ఆలయంలో ఉన్నటువంటి అడ్డంకులు, సమస్యలు తొలగించేందుకు తాము అధ్యయనం చేశామని వాటికి సరైన పరిహారం తెలియజేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి తమకు సహకరించిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తో పాటు ఆలయ ప్రముఖులు ,ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. **సిద్ధాంతి మహేంద్ర కుమార్కు సన్మానం.** పులివెందుల శ్రీ రంగనాథ స్వామి క్షేత్రంలో అష్టమంగళ, దైవ ప్రశ్న కార్యక్రమాలు నిర్వహించిన సిద్ధాంతి డిఎస్ మహేంద్ర కుమార్ కు పులివెందుల కు చెందిన ఆర్యవైశ్య నాయకులు, దినేష్ మెడికల్స్ అధినేత మేడం దినేష్ కుమార్, ఈవో రమణ, శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈవో, సీనియర్ జర్నలిస్టు అల్లం రంగనాయకులు రాయల్, చల్లా వంశీయులకు, శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత ఆరవేటి నారాయణరెడ్డి తదితరులు ఘనంగా సన్మానించారు. సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అందజేశారు.

పులివెందులలో పోలీస్ హెల్ప్‌లైన్ ప్రారంభం

● ప్రజా సమస్యలపై తక్షణ స్పందనకు ప్రత్యేక వ్యవస్థ



పులివెందుల, మన జనప్రగతి, అక్టోబర్ 13:- ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించడం లక్ష్యంగా పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ హెల్ప్‌లైన్ నంబర్ 9490864264 ను జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ మంగళవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలను, అత్యవసర సమాచారాన్ని పోలీసులకు తెలియజేసేందుకు ఈ హెల్ప్‌లైన్ ఉపయోగపడుతుందని తెలిపారు. హెల్ప్‌లైన్ ద్వారా అందే ఫిర్యాదులు, సమాచారంపై తక్షణమే స్పందించి, అవసరమైన పోలీసు సహాయం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు జిల్లా పోలీసు శాఖ చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ బి. మురళి, అర్బన్ సీఐ పురుషోత్తం రాజు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల రిజర్వేషన్ల ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలి

- 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని పాటించాలి: సీఎస్ సాయి ప్రసాద్



మదనపల్లె, మన జనప్రగతి, అక్టోబర్ 13:- స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల కేటాయింపులో ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాలను పక్కాగా పాటిస్తూ పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని మించకుండా, జీవో 154 ప్రకారం నిర్ణీత గడువులో ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, ఇతర ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కలు, బీసీలకు తాజా ఓటర్ల జాబితా ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలని స్పష్టం చేశారు.జీవో 154 ప్రకారం గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియను సంబంధిత అధికారులు తమకు అప్పగించిన బాధ్యతల మేరకు చేపట్టాలని సూచించారు.అనంతరం అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియను మంగళవారం రాత్రిలోగా, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యుల రిజర్వేషన్లను బుధవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లా గెజిట్‌లో ప్రచురించి, ప్రతిని రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో ప్రభాకర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అమరావతి క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్స్‌కు శంకుస్థాపన

47 అంతస్తులు, 206 మీటర్ల ఎత్తుతో నిర్మాణాలు

టవర్లు అందుబాటులోకి వస్తే 25 వేల మందికి ఉపాధి: మంత్రి నారాయణ



అమరావతి, మన జనప్రగతి, అక్టోబర్ 13:- అమరావతిలోని ఉద్దండరాయునిపాలెం క్వాంటం వ్యాలీలో ట్విన్ టవర్స్ (ఏ1, ఏ2) నిర్మాణానికి రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మంగళవారం శంకుస్థాపన చేశారు.సీడ్ యాక్సిస్ రోడ్డు పక్కన 11 ఎకరాల్లో నిర్మించనున్న ఈ రెండు టవర్లు ఒక్కొక్కటి 47 అంతస్తులు, 206 మీటర్ల ఎత్తుతో నిర్మించనున్నారు. మొత్తం 37.48 లక్షల చదరపు అడుగుల నిర్మిత విస్తీర్ణంలో ఆధునిక కార్యాలయాలు, పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలకు అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులో మొత్తం ఎనిమిది టవర్లు నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. ట్విన్ టవర్స్ అందుబాటులోకి వస్తే సుమారు 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. క్వాంటం కంప్యూటింగ్ సాంకేతికత రక్షణ, వైద్యం, బ్యాంకింగ్, ప్రకృతి వైపరీత్యాల ప్రభావాన్ని అంచనా వేయడం, నష్టాలను తగ్గించడం వంటి రంగాల్లో కీలకంగా ఉపయోగపడుతుందని మంత్రి వివరించా రు. నిర్మాణాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసి, అమరావతిని అధునాతన సాంకేతిక పరిశోధనలకు కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు.

బీసీలకు 40 శాతానికి పైగా రాజకీయ ప్రాతినిధ్యమే లక్ష్యం

- త్వరలో బీసీ రక్షణ చట్టం తీసుకొస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర




మంగళగిరి, మన జనప్రగతి, అక్టోబర్ 13:- స్థానిక సంస్థల్లో బీసీలకు 40 శాతానికి పైగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గాయని మంత్రి ఆరోపించారు. ఈ కారణంగా సుమారు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి, సర్వే నిర్వహించి నివేదిక సిద్ధం చేసిందన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అమలుకు ఎదురైన న్యాయపరమైన సమస్యలను దృష్టిలో ఉంచుకుని, బీసీలకు సాధ్యమైనంత ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించే చర్యలు చేపడుతున్నామని చెప్పారు.గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు కేటాయించిన రిజర్వేషన్లతో పాటు, రాజకీయ పార్టీల తరఫున టికెట్లు ఇవ్వడం ద్వారా 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం కల్పించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోతే 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన సుమారు రూ.12,500 కోట్ల నిధులపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు.బీసీ సామాజిక వర్గాల ఆర్థికాభివృద్ధికి వృత్తులవారీగా పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. చేనేత కార్మికులకు నేతన్న సేవ పథకం కింద ఏడాదికి రూ.25 వేల సాయం, మత్స్యకారులకు మత్స్యకార సేవ పథకం ద్వారా రూ.20 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని చెప్పారు. వడ్డెరలు, కల్లుగీత కార్మికులు, నాయీ బ్రాహ్మణులు తదితర వర్గాలకు కూడా వివిధ రాయితీలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వివరించారు.బీసీ నాయకత్వానికి రక్షణ కల్పించేందుకు నారా లోకేష్ ఆధ్వర్యంలో బీసీ రక్షణ చట్టం ముసాయిదా సిద్ధమైందని, త్వరలో చట్టాన్ని తీసుకురానున్నట్లు కొల్లు రవీంద్ర తెలిపారు. బీసీలకు రాజకీయ, ఆర్థిక, విద్యా రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

బీఎల్ఓలతో డీఎస్పీ మురళీ నాయక్ సమావేశం

శాంతిభద్రతల పరిరక్షణ, పారదర్శక ఎన్నికలే లక్ష్యం

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచన



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 13: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, పారదర్శక ఓటింగ్ ప్రక్రియ కోసం పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపడుతోందని డీఎస్పీ మురళీ నాయక్ స్పష్టం చేశారు.మంగళవారం పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ మురళీ నాయక్ అధ్యక్షతన,సీఐ పురుషోత్తం రాజు మరియు ఎస్సైల ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓ) సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఎన్నికల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు.స్థానిక వివాదాలు,పాత కక్షల ఆధారంగా ఏయే పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక ప్రాంతాలుగా మారే అవకాశం ఉందో బీఎల్ఓలు ముందస్తుగా గుర్తించాలని స్థానికంగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై సమాచారాన్ని వెంటనే అర్బన్ పోలీసులకు చేరవేయాలన్నారు.ఓటర్లను మద్యం,నగదు లేదా ఇతర బహుమతులతో ప్రలోభపెట్టే చర్యలను బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి,ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రాల సమీపంలో ఎలాంటి ప్రచారాలు,రాజకీయ కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది,బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174